సాక్షి అనకాపల్లి

గురువారం । 15 । ఆగస్టు । 2024





ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

దేశభక్తి ఉప్పొంగగా.. అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో భారీ మానవహారం

మహనీయుల స్ఫూర్తి.. స్వాతంత్ర్య దీప్తి

కదం తొక్కారు.. పదం పాడారు.. దేశభక్తి ఉప్పొంగగా భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. మువ్వన్నెల జెండా రెపరెపలు మహోత్తుంగ తరంగాన్ని తలపించాయి. అనకాపల్లిలో బుధవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ అందరిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపింది. కలెక్టర్ విజయ కృష్ణన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ వర్గాల ప్రజలు ప్రదర్శనలో పాల్గొన్నారు. సమర యోధుల త్యాగాలను స్మరించుకొని, వారి బాటలో పయనిస్తామని ప్రతిజ్ఞ చేశారు. – అనకాపల్లి

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

చూడు చూడు నీడలు.. సామాన్యుల బాధలు

- విద్యుత్ కోతలతో రోగులు, సిబ్బంది ఇక్కట్లు
- జనరేటర్ పనిచేసేది 10 నిముషాలే!
- వీల్ చైర్స్ ఉన్నా నెట్టుకెళ్లే సిబ్బంది ఏరీ?
- ఎక్స్‌రే కోసం గంటలపాటు క్యూలైన్లో రోగులు
- అల్ట్రా సౌండ్ స్కాన్‌కు చేతి రాతతోనే రిపోర్ట్
- గత ప్రభుత్వంలో రూ.1.50 కోట్లతో ఎన్టీఆర్ వైద్యాలయం ఆధునికీకరణ
- కూటమి సర్కారు రాకతో ఆస్పత్రి నిర్వహణలో ఉదాశీనత
- సిబ్బంది, నిర్వహణ లేక మూలన పడివున్న సీటీ స్కాన్ యంత్రం
- సాక్షి ఫీల్డ్ విజిట్‌లో బయటపడిన ప్రభుత్వ నిర్లక్ష్యం



ఎన్టీఆర్ వైద్యాలయం

సాక్షి, అనకాపల్లి: జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ప్రధాన ఆస్పత్రి ఎన్టీఆర్ వైద్యాలయం. వైద్యం అందించేందుకు నిపుణులైన డాక్టర్లున్నా.. అవసరమైన మందుల్లేవు. వైద్య పరికరాలున్నా.. అందులో ఏవి, ఎప్పుడు పనిచేస్తాయో తెలియదు. రోగుల్ని తరలించేందుకు వీల్‌చైర్లున్నా.. వాటిని నెట్టుకెళ్లే సిబ్బంది కనిపించరు. రోజూ రెండు మూడు గంటలు కరెంట్ కోతలు. జనరేటర్ ఉన్నా.. అది 10 నిముషాలకే పరిమితం. స్కానింగ్, ఎక్స్‌రే గదుల్లో ఏసీల్లేవు. రద్దీగా ఉండే అల్ట్రాసౌండ్ స్కాన్ రూంలో ఒక్కరే రేడియాలజిస్టు. నెలవారీ చెకప్‌లో భాగంగా ఆస్పత్రికి వచ్చే గర్భిణులు సైతం ఇక్కడ ఐదారు గంటలు నిరీక్షించాల్సిందే. సోమవారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగుల అగచాట్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కరెంట్ లేక.. ఆస్పత్రిలో ఉండలేక..

ఉదయం 9 గంటలకు ఓపీ సేవలు మొదలయ్యాయి. 10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వైద్యులు, రోగులు అవస్థలు పడ్డారు. గైనిక్ వార్డులో గర్భిణులు, బాలింతలు ఫ్యాన్లు తిరగక నరకం చూశారు. పసిబిడ్డలు, ఆపరేషన్లు చేయించుకున్న రోగుల పరిస్థితి దారుణం.

ఓపీ ఫుల్.. వైద్యం నిల్

సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సగటున రోజుకు 500–600 ఓపీలు వస్తున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంటతో ఓపీ సేవలు బంద్. అత్యవసర వైద్యం కోసం మధ్యాహ్నం 2 తర్వాత వస్తే.. అక్కడున్న సిబ్బంది క్షణం కూడా ఆలోచించకుండా డాక్టర్ ఆపరేషన్ థియేటర్లో ఉన్నారని, ఆపరేషన్ పూర్తయ్యేసరికి ఎంత టైం పడుతుందో చెప్పలేమని రోగులకు చెప్తారు. సిబ్బంది మాటలు నమ్మి కొందరు రోగులు తప్పక అక్కడే గంటల పాటు పడిగాపులు కాస్తుంటారు. చివరికి నిరాశగా తిరుగుముఖం పడతారు. ఉదయాన్నే వచ్చి క్యూలో నిలిచి, ఓపీ చూపించుకుంటే, ఏ చిన్నపాటి ఎమర్జెన్సీ అయినా.. కేజీహెచ్‌కి వెళ్లిపోవాలని రిఫర్ చేసేస్తారు. గైనిక్ రోగులైతే దాదాపుగా అంతా కేజీహెచ్ బాట పట్టాల్సిందే.

జరిగిన మేళ్లన్నీ గత ప్రభుత్వంలోనే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'నాడు–నేడు'లో భాగంగా ఎన్టీఆర్ ఆస్పత్రి ఆధునికీకరణ, మౌలిక వసతులకు రూ.1.5 కోట్లు మంజూరైంది. రెండు విడతల్లో పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్‌తో మూడో దశ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో సీఎస్సార్ నిధులు రూ.1.85 కోట్లతో సీటీ స్కాన్ యంత్రం కొనుగోలు చేశారు. దీని నిర్వహణ, సిబ్బందికి ప్రతి నెలా రూ.1.30 లక్షలు వెచ్చించాలి. ఆ మాత్రం నిధులు కూడా వెచ్చించకపోవడంతో ఆ యంత్రం నిరుపయోగంగా మిగిలింది.

- సర్జికల్ గ్లౌస్ లేవు. అత్యవసరానికి కాటన్, ఐవి క్యానల్, స్కానింగ్ జెల్ కొరత ఉంది.
- ఆపరేషన్ సమయంలో కొన్ని మందులు, వైద్య సామగ్రిని రోగులు ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుగోలు చేసి, వైద్యులకు అందిస్తున్నారు.
- రెండు నెలల నుంచి పాంటాప్ ఇంజక్షన్‌లు లేవు.



ఆస్పత్రి బయట ధనలక్ష్మిని వీల్‌చైర్‌లో తీసుకెళుతున్న రోగి బంధువు



మూలకు చేరిన సీటీ స్కాన్ యంత్రం

నా గోడు వినే వారేరీ..



18 రోజుల క్రితం మా గ్రామంలో పనిచేస్తూ ఒక్కసారిగా కాలు జారి పడిపోయాను. మక్క విరిగిపోయింది. అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి మూడు రోజుల తరువాత ఇంటికి పంపించారు. ఈరోజు కుట్లు విప్పించుకోవడానికి ఉదయం 9 గంటలకు వచ్చాను. ఇప్పుడు సమయం 12 గంటలయింది. ఆస్పత్రిలో అటు ఇటూ తిప్పుతున్నారు తప్ప నా గోడు వినేవారు లేరు. కుట్లు విప్పటానికి ఎంత సమయం పడుతుందో వైద్యులు చెప్పడం లేదు.

–వి.ముత్యాలనాయుడు, జంపిని, మాడుగుల మండలం

ఆ మూడు మాత్రలే ఇస్తున్నారు..



నా పేరు ధనలక్ష్మి. అనకాపల్లిలో మా అన్నయ్య ఇంటి వద్ద ఉంటున్నా. నాకు కడుపులో కాయ ఉంది. మూడు నెలలుగా ఎన్టీఆర్ ఆస్పత్రిలోనే చూపించుకుంటున్నా. ఒకట్రెండు సార్లు స్కానింగ్ చేశారు. మూడు రకాల మందులిచ్చారు. తగ్గలేదని మళ్లీ వెళ్తే.. అవే మందులిస్తున్నారు. ఇప్పుడు మరోసారి డాక్టర్‌కు చూపించుకున్నా. మళ్లీ స్కానింగ్ చేయాలన్నారు. కరెంట్ లేదు. వచ్చేవారం రమ్మన్నారు. నడవలేని పరిస్థితి. మా పాపే నన్ను వీల్‌చైర్‌లో తోసుకుని వెళ్లింది. ఈ వారం కరెంటు లేదని మరోసారి రావడం అంటే నాలాంటి వాళ్లకి ఎంతో కష్టం. అధికారులు దయవుంచి మా కష్టాలు తీర్చాలి.

కరెంట్ లేదని 2 గంటల నిరీక్షణ



నా పేరు ఎం.లక్ష్మి. వయసు 50 ఏళ్లు. మాది అనకాపల్లి టౌన్. నా కాలు విరిగి, వైద్యం కోసం ఉదయం 9 గంటలకి ఆస్పత్రికి వచ్చా. ఓపీ చూపించుకున్నాను. డాక్టర్ ఎక్స్‌రే రాశారు. నడవలేకపోతున్నా. ఇక్కడ వీల్‌చైర్ తోసేవారు లేకపోతే.. నా భర్తే నన్ను వీల్‌చైర్‌లో ఎక్స్‌రే దగ్గరకు తీసుకెళ్లారు. కరెంట్ లేదని రెండు గంటలు లైన్‌లో ఉండిపోయా. ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లేందుకు అంత డబ్బుల్లేవు. డాక్టర్ చూసేసరికి మధ్యాహ్నం 2.30 అయింది. ఉదయం నుంచీ ఆకలితో పడిగాపులు తప్పలేదు.

ఆస్పత్రిలో సిబ్బంది వివరాలు

మొత్తం వైద్య సిబ్బంది	36
సివిల్ సర్జన్లు	12
డిప్యూటీ సివిల్ సర్జన్లు	7
అసిస్టెంట్ సివిల్ సర్జన్లు (సైకియాట్రిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది)	17
స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది (ప్రభుత్వ/ఔట్‌సోర్సింగ్)	510



ఓపీ కోసం క్యూలైన్లలో వేచి ఉన్న రోగులు



కరెంట్ లేదని ఇంటికి వెనుదిరుగుతున్న రోగులు

'సాక్షి' రిపోర్టర్ల బృందం పరిశీలనలో..

- ఎన్టీఆర్ వైద్యాలయానికి అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల నుంచి రోగులు వస్తున్నారు.
- ఉదయం 9 గంటల నుంచి ఓపీ ప్రారంభమైంది. డాక్టర్లు ఓపీలు ప్రారంభించి 10–20 మంది రోగుల్ని చూసేసరికే కరెంట్ పోయింది.
- ఉదయం 10 గంటలకు తీసిన కరెంట్ 11.45 వరకూ రాలేదు.
- జనరేటర్ సౌకర్యం ఉన్నా, అది 10 నిమిషాలు మాత్రమే పనిచేసింది.
- గత ప్రభుత్వం గైనిక్ వార్డులో ఏర్పాటు చేసిన రెండు ఇన్వర్టర్లు 30 నిమిషాల పాటు పనిచేశాయి. ఆ తర్వాత గైనిక్ వార్డులో కూడా అంధకారం అలముకుంది.
- సోమవారం 535 ఓపీలు చూశారు. వీరిలో 31 మంది ఇన్ పేషెంట్లుగా చేరారు.
- వైద్యాలయంలో 36 మంది వైద్యులకు నలుగురు సెలవులో ఉన్నారు. 32 మంది రెండు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తించారు.
- ఓపీ సమయంలో 15 మంది వైద్యులున్నారు.
- గైనిక్ విభాగంలో ముగ్గురు, జనరల్ మెడిసిన్ విభాగంలో ముగ్గురు, మిగిలిన విభాగాల్లో ఇద్దరేసి స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు.
- ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ కేటగిరీలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది 510 మందిలో సోమవారం 215 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు.
- వీల్‌చైర్స్‌లో రోగుల్ని తీసుకెళ్లేందుకు బాయ్స్ ఎక్కడా కనిపించలేదు.
- కరెంట్ లేకపోవడంతో ఎక్స్‌రే కోసం మధ్యాహ్నం 12 గంటల వరకూ క్యూలో రోగులు పడిగాపులు కాశారు.
- రోజు వారీ 80కి పైగా ఎక్స్‌రేలు తీసే పరిస్థితి. సోమవారం 40 ఎక్స్‌రేలు కూడా తీయలేదు.
- గర్భిణుకు అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్నా, రిపోర్టులను పేపర్‌పై పెన్‌తో రాసి ఇస్తున్నారు.
- రేడియాలజీ విభాగంలో ఒక్కరే ఉండడంతో రోజుకు 30 స్కాన్‌లు కూడా జరగట్లేదు.
- 300 బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. 250 బెడ్స్‌పై రోగులు చికిత్స పొందుతున్నారు.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ దగ్గర వేచి ఉన్న రోగులు



గైనిక్ ఓపీ దగ్గర గర్భిణుల పడిగాపులు



చిన్న పిల్లల ఓపీ దగ్గర నిరీక్షిస్తున్న రోగులు

సొమ్మొకరిది.. సోకొకరిది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి ఎంపీగా ఉన్న భీశెట్టి వెంకట సత్యవతి తన ఎంపీ నిధులతో ఎన్టీఆర్ వైద్యాలయానికి అంబులెన్స్‌ను అందించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రస్తుత ఎంపీ రమేష్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్లు, ఫోటోలు అంబులెన్స్‌పై వేసుకున్నారు.

జనరేటర్ సరిగ్గా పనిచేయలేదు

ఆస్పత్రిలో కరెంట్ సమస్య వాస్తవమే. ఈపీడీసీఎల్ అధికారులకు చెప్పాం. గతంలో ఎప్పుడూ ఇంత సేపు పవర్ కట్ లేదు. ట్రాన్స్‌ఫార్మర్లో సాంకేతిక సమస్య వల్ల కాసేపు, చెట్టు ఒరిగి మరికాసేపు కరెంట్ సరఫరా నిలిచినట్లు విద్యుత్ అధికారులు చెప్పారు. కొత్త జనరేటర్ కొనుగోలు చేస్తాం. వాటితో పాటు వార్డులో ఉండే రోగులు కోసం ఇన్వర్టర్లు కూడా ఏర్పాటు చేస్తాం. రెండు ఇన్వర్టర్లు ఉన్నాయి. బ్యాకప్ సామర్థ్యం ఎక్కువగా ఉండే కొత్త ఇన్వర్టర్లు తీసుకుంటాం.

– డాక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్/డీసీహెచ్ఎస్, అనకాపల్లి

న్యూస్‌రీల్

ఇంటర్‌లో మిగులు సీట్లకు అడ్మిషన్లు

అనకాపల్లి: జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు అవకాశం కల్పించిందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా చేరదలచుకునే విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

యలమంచిలిలో స్పెషల్ రైళ్లకు హాల్టు

యలమంచిలి రూరల్: యలమంచిలిలో మూడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పిస్తూ ఈస్టుకోస్టు రైల్వే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విశాఖపట్నం–తిరుపతి మధ్య రాకపోకలు సాగించే 08583/08584 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 08543/08544 నంబర్లతో విశాఖపట్నం–బెంగుళూరు మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లు, నాందేడ్– శ్రీకాకుళం మధ్య రాకపోకలు జరిపే 07487/07488 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని, ఈ సౌకర్యాన్ని ఇక్కడి రైలు ప్రయాణికులంతా ఉపయోగించుకోవాలని రైల్వే ప్రయాణికుల సంఘం సభ్యుడు గణేశ్వరరావు, స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆదారి పూరీ జగన్నాథం తెలిపారు.

అకటకటా..'శకట' కష్టం!

- ఈ ఏడాది ప్రదాగస్టు వేడుకల్లో ప్రగతి రథాల ప్రదర్శన లేనట్టేనా..!
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు ప్రదర్శించ కూడదనే కొత్త నాటకమా ?



గత ఏడాది ఆకర్షణగా నిలిచిన శకటాలెన్నో..

సాక్షి, అనకాపల్లి: స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలను కళ్లకు కట్టినట్టు ప్రజలకు తెలిపేందుకు ప్రగతి రథాలను (శకటాలను) ప్రదర్శించడం ఆనవాయితీ. అయితే ఆ సంప్రదాయానికి ఈ ఏడాది కూటమి ప్రభుత్వం బ్రేక్ వేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చెప్పుకో తగ్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రగతి శకటాలు ప్రదర్శించవలసి రావడంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

కొత్త జిల్లాలో రెండేళ్ల పాటు ప్రదర్శన

రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఎంతో ఆకర్షణీయంగా తయారు చేసిన 22 ప్రగతి శకటాలను కొత్తగా ఏర్పాటైన అనకాపల్లి జిల్లాలో 2022 నుంచి అధికారులు రెండేళ్ల పాటు ప్రదర్శించారు. వాటిలో ఆకర్షణీయంగా ఉన్న వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అధికారం చేపట్టి తొలి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహిస్తోంది. గత ప్రభుత్వంలో అమలు చేసిన నవరత్నాల సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా తీసివేసే కార్యక్రమం చేపడుతున్న కూటమి సర్కారు శకటాల నిలిపివేతకు చర్యలు తీసుకుంది.

అందుకే ప్రగతి రథకాలకు బ్రేక్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రగతి శకటాలను ప్రదర్శించడం లేదని పైకి చెబుతున్నా.. ఆంతర్యం వేరే ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్ర మే ఉంది. కానీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతోనే రాష్ట్ర వ్యాప్తంగా శకటాల ప్రదర్శనకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బ్రేక్ వేసిందని చెబుతున్నారు.

బార్క్ భూసేకరణకు రైతుల అడ్డగింత



ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

అచ్యుతాపురం: బాబా అణు విద్యుత్ కర్మాగార ఏర్పాటులో భాగంగా ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు బుధవారం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను రైతులు అడ్డుకున్నారు. దొప్పెర్ల, దోసూరు రెవెన్యూ పరిధిలోని రైతులు భూసేకరణకు తాము సహకరించబోమని సంబంధిత అధికారులకు తేల్చి చెప్పారు. భూములు సేకరించదలచిన ధర ముందుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా గతంలో సేకరించిన భూముల్ని అనుకొరి అదే సర్వే నంబర్లు ఉన్న వాటిని 22 ఏలో ఉంచి ఇప్పటికీ మార్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకునే భూసేకరణకు తాము అనుకూలంగాలేమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ 500 ఎకరాలకు సంబంధించిన భూముల్ని 22 ఏలో ఉంచడం వల్లే రైతులు విసిగిపోయారని తెలిపారు. బార్క్ రహదారికి భూముల్ని ఇవ్వడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లగా భూముల్ని అమ్ముకోలేక, కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోలేక ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమస్య గురించి తమకు ఇప్పుడే తెలిసిందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండు పంచాయతీలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం



రూపుదిద్దుకుంటున్న వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. అధికారులు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు కూర్చొని వేడుకలను తిలకించేందుకు వీలుగా ఆరు గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.



వేడుకలను తిలకించేందుకు సిద్ధం చేసిన వేదిక



క్లుప్తంగా

బియ్యం గింజలతో జాతీయ జెండా



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ హృదయం ఆకారంలో జాతీయ జెండాను రూపొందించాడు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో బియ్యం గింజలతో ఐ లవ్ ఇండియా అని జెండాను తయారు చేశాడు. దీనికిగాను 628 బియ్యం గింజలను వినియోగించానని, వీటిలో 289 ఆరెంజ్, 210 ఆకుపచ్చ, 139 తెలుపు రంగుల బియ్యం గింజలతో హృదయ ఆకారంలో జెండాను తయారు చేసి అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు.

బియ్యం గింజపై జాతీయ జెండా



బియ్యం గింజ మీద జాతీయ జెండా చెక్కిన గోపాల్

మాడుగుల రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిదోండ గోపాల్ తన ప్రతిభను చాటారు. బియ్యం గింజ మీద జాతీయ జెండాను చెక్కారు. ఇందుకు రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ బుధవారం తెలిపారు. గతంలో పెన్సిల్ ముల్లు, సుద్ద ముక్కల మీద ఎన్నో సూక్ష్మ కళా రూపాలును చెక్కి తన ప్రతిభను నిరూపించుకున్నారు.

4 తులాల బంగారం చోరీ

రాంబిల్లి (యలమంచిలి): పంచదార్ల గ్రామానికి చెందిన గుర్రం అరుణకుమారి అనే మహిళ ఇంట్లో చోరీ జరిగినట్లు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు బుధవారం తెలిపారు. వివరాలివి. గ్రామానికి చెందిన గుర్రం అరుణకుమారి ఈనెల 9న తన పుట్టింటికి వెళ్లింది. బుధవారం పుట్టింటి నుంచి వచ్చి చూడగా ఇంట్లో బీరువాలో గల 4 తులాల బంగారం చోరీకి గురైనట్టు గుర్తించింది. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహనీయుల స్ఫూర్తి.. స్వాతంత్ర్య దీప్తి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- హర్ ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్ విజయ కృష్ణన్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

అనకాపల్లి: దేశం కోసం అహర్నిశలూ శ్రమించి, స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం వద్ద బుధవారం కలెక్టర్ జెండా ఊపి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించారు. భారత్ మాతాకీ జై.. అని నినదిస్తూ మువ్వన్నెల జెండా చేత బట్టి ముందుకు సాగి, వీక్షకుల్లో జాతీయ భావాన్ని, స్ఫూర్తిని నింపారు. నెహ్రూ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని దాస్య శృంఖలాల నుంచి విడిపించడానికి స్వాతంత్ర్య సమరయోధులు ఎంతో కృషి చేశారని, వారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అమరవీరుల బాటలో పయనించి యువత ఎదగాలని, దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. విజయభాస్కర్, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో ఎ.జె.చిన్ని కృష్ణ, డీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులవాణి, జిల్లా డీఎఫ్‌వో లక్ష్మణరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బి.సుజాత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరులో మాడుగుల వీరులు



మాడుగులలో చరిత్రకు సాక్ష్యంగా స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం



స్వాతంత్ర్య సమరంలో అల్లూరి, వి.వి.గిరి వంటి ప్రముఖులకు ఆశ్రయమిచ్చిన ఇల్లు ఇదే



భమిడిపాటి చిన యజ్ఞశర్మ



పుట్టా అమరయ్యశెట్టి (ఫైల్)

మాడుగుల : నాటి స్వాతంత్ర్య సమరంలో ఢిల్లీ నుండి గల్లీ వరకు ఎందరో మహానుభావులు భారతమాతను దాస్య శృంఖలం నుంచి విముక్తి చేసేందుకు ఎన్నో పోరాటాలు ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. ఇంకొందరు కటకటాల వెనుకకు వెళ్లారు. నాటి స్వాతంత్ర్య వీరులకు పలువురికి గుర్తింపు లభించినా ఇంకా ఎందరో తగిన గుర్తింపు మిగిలిపోయారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తులు పోగొట్టుకుని, జైలు జీవితాలు అనుభవించి, ప్రభుత్వ గుర్తింపు లేక తుదిశ్వాస విడిచిన వారు కూడా ఉన్నారు. ఇప్పటికైనా వారి వారసులను గుర్తించి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు.

మాడుగుల పట్టణానికి చెందిన పుట్టా అమరయ్య శెట్టి, బమిడిపాటి చిన యజ్ఞశర్మ నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టయ్యి బరంపురం రాయవేలూరు జైల్లో రెండేళ్లపాటు గడిపారు. అలాగే మాడుగులలో వద్దాది గోపాల్ భూపతిదేవ్ వర్మ, నానాసాహెబ్, కళ్యాణం ధర్మారావు వంటివారు.. ఉద్యమంలో చేదోడువాదోడుగా ఉండేవారు. అమరయ్యశెట్టి జైలుకు వెళ్లినపుడు విశాఖ జిల్లాలో ఉద్యమం నీరు కారకూడదని, వీరు ఉద్యమాలకు ఊపిరిపోశారు. దేశానికి నాలుగో రాష్ట్రపతిగా పని చేసిన వి.వి.గిరి అప్పట్లో గాంధీజీ ఆదేశాలతో మాడుగుల వచ్చి పుట్టా అమరయ్యశెట్టి ఇంటిలో ఆరుమాసాలు ఉండి ఉద్యమాన్ని సాగించారని చెబుతారు. విప్లవ వీరుడు అల్లూరి కూడా మల్లుదొరతో కలిసి పోరాట సమయంలో మాడుగుల వచ్చి అమరయ్యశెట్టి ఇంట్లోనే ఉద్యమకారులతో చర్చలు జరిపారని చెబుతారు. అమరయ్యశెట్టి వారసులు మాడుగులలో ఈనాటికీ ఉన్నారు.

సమరయోధుల వారసులను ఆదుకోవాలి

స్వాతంత్ర్య పోరాటంలో దేశం కోసం కుటుంబానికి దూరంగా ఉండి ఆస్తులు అమ్మి దేశం కోసం జైలు జీవితాలు గడపడంతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు గురై చివరకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులకు గుర్తింపు ఇవ్వాలి. అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వసతి సౌకర్యంతో పాటు, గౌరవ వేతనం అందించాలి

– పుట్టా శ్రీను, రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల వారసుల రాష్ట్ర సంఘ సభ్యుడు, మాడుగుల

19న తాండవ నీరు విడుదల



తాండవ కాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం : తాండవ రిజర్వాయరు నుంచి ఖరీఫ్ సాగుకు ఆయకట్టుకు ఈనెల 19వ తేదీన నీరు విడుదల చేసేందుకు ముహూర్తం నిర్ణయించామని ప్రాజెక్టు అనురాధ తెలిపారు. ఆమె బుధవారం తాండవ ఆయకట్టు పరిధిలో ప్రధాన కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో రైతులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు శివారు ఆయకట్టుకు నీరు సరఫరా చేసేందుకు ప్రధాన కాలువలో పలు చోట్ల పూడిక తొలగిస్తున్నామన్నారు. పూడికతీత పనులు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదన్నారు. ఆయకట్టుదారుల నీటి సంఘాల మాజీ అధ్యక్షులు, అధికారులు సంయుక్తంగా ఈ పూడిక తీత పనులు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ఆశించిన దాని కంటే అదనంగా నీరు రావడం జరిగిందన్నారు. తాండవ ప్రాజక్టులో మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 375.6 అడుగులు చేరిందన్నారు. ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం ఇన్ ఫ్లో రోజుకు 300 క్యూసెక్కులు నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు తాండవ నీరు విడుదల అధికారులు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేఈలు శ్యామ్‌కుమార్ వినయ్‌కుమార్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయంభూ ఆలయంలో ఉత్సవ రాట



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ రాట వేస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు

చోడవరం : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవమైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ రాటను ఆలయ ప్రాంగణంలో బుధవారం వేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి, దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.వి. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రాల మధ్య స్వామి వారి ఉత్సవ రాటను కన్నుల పండువగా వేశారు. ఆలయ ప్రధాన ముఖద్వారం పక్కన ఉత్సవరాట వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు పాల్గొని ఉత్సవ రాట వేశారు. సెప్టెంబరు 7వ తేదీన వినాయక చవితి కావడంతో ఆ రోజు నుంచి స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమౌతాయి. అయితే నవరాత్రి ఉత్సవాలకు ముందుగా ఏర్పాట్లు, ఇతర పనులు చేసేందుకు ఉత్సవ రాట వేసినట్లు ఆలయ అర్చకుడు చలపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కొడమంచిలి శ్రీనువాసరావు, సంగీత విఘ్నేష్, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, పసుమర్తి మల్లిక్, సాంబ పాల్గొన్నారు.

టేకు ప్లాంటేషన్ పరిశీలన



ఆరిల్లోవ అటవీప్రాంతంలో టేకు ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

గొలుగొండ: ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో నాటిన టేకు ప్లాంటేషన్‌ను ఉమ్మడి విశాఖ అటవీశాఖ రీసెర్చ్ రేంజ్ అధికారి దీప్తి బుధవారం పరిశీలించారు. ఇక్కడ 2006 సంవత్సరంలో ఐదు ఎకరాల్లో టేకు ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు.ఈ ప్లాంటేషన్ ఎదుగుదలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాంటేషన్ ఎదుగుదల సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఇక్కడ వచ్చే టేకు విత్తనాలను మరో ప్రాంతంలో నాటేందుకు రీసెర్చ్ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ పోటీల్లో సత్తా చాటిన డిగ్రీ విద్యార్థి



సాఫ్ట్‌బాల్ విజేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు

నర్సీపట్నం : అంతర జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్న రావుల సోమేశ్వరరావు సత్తా చాటాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు అభినందించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండ గుడ్ షెఫర్డ్ స్కూల్‌లో జరిగిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున సోమేశ్వరరావు పాల్గొని మంచి ప్రతిభ కనబరిచాడు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై ఫిర్యాదు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

రోలుగుంట : జానకీరాంపురం గ్రామంలో గల పీఏసీఎస్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు గొల్లు కల్పన, కిల్లాడ అప్పల సీతయ్య నాయుడు తదితరులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.బినామీ పేర్లతో రుణాల మంజూరు, నిధుల దుర్వినియోగం జరిగాయని పేర్కొన్నారు. దీనిపై ఆ శాఖ అధికారులు నర్సీపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి అధికారి రమణమూర్తి సిబ్బందితో వచ్చి రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు విలేకరులకు తెలిపారు.

స్వాతంత్ర్య చరిత్రకు చెరగని ఆనవాళ్లు



చోడవరంలో నాడు బ్రిటిష్ జెండా ఎగిరి, నేడు భారతీయ జెండా ఎగురుతున్న వందేళ్ల నాటి హార్డింజ్ గెస్ట్‌హౌస్, ఆ ఆవరణంలో నాటి జెండా దిమ్మ

- నాడు బ్రిటిష్ జెండా ఎగిరిన చోటే నేడు మువ్వన్నెల రెపరెపలు
- స్వాతంత్ర్య దినాన్నే జెండా స్థూపం నిర్మాణం



చోడవరం తహసీల్దార్ కార్యాలయంలో 1947 ఆగస్టు 15వ తేదీన నిర్మించిన జెండా దిమ్మ ఇది

చోడవరం : బ్రిటిషు పాలనలో చోడవరానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. హార్డింజ్ అనే బ్రిటిష్ గవర్నర్ చోడవరం కేంద్రంగా చేసుకొని ఈ ప్రాంతంలో పన్నులు వసూలు చేశారు. ఆ బ్రిటిష్ అధికారి విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడ ఆయనకి ఒక గెస్ట్ హౌస్ ఉండేది. అదే చోడవరం హార్డింజ్ గెస్ట్ హౌస్. మరో పక్క స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15వ తేదీన దేశంలో నిర్మించిన అతి కొద్ది జెండా స్థూపాల్లో ఒకటి చోడవరంలో ఉంది. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంతో మువ్వన్నెల జెండాలు దేశమంతటా రెపరెపలాడించడానికి నాటి యువత ఎంతో ఉరకలేసిందనడానికి ఈ జెండా స్థూపాలు నిలువెత్తు నిదర్శనాలుగా నిలిచాయి. స్వాతంత్ర్యం వచ్చి 76 యేళ్లు కావస్తున్నా నాటి జెండా స్థూపాలు అమరవీరుల త్యాగఫలాన్ని నేటి తరానికి గుర్తు చేస్తూనే ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించిన క్షణమే దేశవ్యాప్తంగా మువ్వన్నెల జెండా ఎగురవేసేందుకు పలు చోట్ల రాత్రికి రాత్రే సంబరాల నడుమ జెండా స్థూపాలను నిర్మించారు. అప్పుడు నిర్మించిన జెండా స్థూపాల్లో చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్మించిన స్థూపం ఒకటి. ఈ జెండా స్థూపానికి నేటికి 76 యేళ్లు. బ్రిటిషు ప్రభుత్వంలో అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన డి.రామదాసు ఈ జెండా స్థూపాన్ని 1947 ఆగస్టు15వ తేదీన నిర్మించి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. తుప్పుపట్టని మిశ్రమ లోహంతో తయారు చేసిన ఇనుప గొట్టంతో ఈ జెండా దిమ్మను నిర్మించారు. అందుకే ఈ జెండా స్థూపం ఎన్నో దశాబ్దాలు గడిచినా నేటికీ చెక్కు చెదరలేదు. హార్డింజ్ గెస్ట్‌హౌస్ వద్ద బ్రిటిష్ జెండా ఎగిరేందుకు గెస్ట్‌హౌస్ బంగ్లాకు ఎదురుగా ఒక స్థూపం ఉండేది. తెల్లదొరల పాలన అంతమైందని తెలిసిన వెంటనే ఈ స్థూపంపై బ్రిటిషు జెండాను దించి భారతీయ మువ్వన్నెల జెండాను అప్పటి స్థానికులు ఎగురవేశారు. సుమారు వందేళ్ల కిందట నిర్మించిన ఈ స్థూపం ఇప్పటికీ చెక్కుచెదరకుండా నాటి స్వాతంత్ర్య పిపాసకు ఆనవాళ్లుగా ఉన్నాయి. హార్డింజ్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల ఈనెల 15వతేదీన జెండా వేడుకలు జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

19 తేదీ తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు !



డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి

అచ్యుతాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో పని సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేశారు. అధికారికంగా ప్రకటించనప్పటికీ ఈ నెల 19 తేదీ తర్వాతే సర్దుబాటు ప్రక్రియ పూర్తి కానుంది. ముందుగా ఈ నెల 12న ఉపాధ్యాయుల పని సర్దుబాటుని మండల స్థాయిలో పూర్తి చేయాలని భావించారు. దీనికి సంబంధించి మిగులు ఉపాధ్యాయుల్ని గుర్తించే విషయంలో ఎన్నుకున్న అంశాలలో కొన్ని సహేతుకంగా లేవని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. 12వ తేదీ మధ్యాహ్నం పూర్తి చేయాల్సిన మండల స్థాయి సర్దుబాటును చివరి నిమిషంలో 17వ తేదీ నాటికి వాయిదా వస్తున్నట్టు ముందుగా ప్రకటించారు. అయితే అనకాపల్లి జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఈ నెల 17న నిర్వహించాల్సి ఉంది. దీంతో పాఠశాలల హెచ్ఎంలలో కొద్దిపాటి గందరగోళం నెలకొని ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ ఈ అంశంలో ఇంకా కసరత్తు చేస్తోంది. మిగులు ఉపాధ్యాయులు అనకాపల్లి జిల్లా పరిధిలో 847 వరకూ ఉన్నట్లు అంచనా. కానీ ఎస్‌జీటీ స్థానాలు మిగిలి ఉన్నవి చాలా తక్కువే. ఈ క్రమంలో మిగులు ఉపాధ్యాయుల్ని మండల స్థాయిలో గుర్తించిన మేరకు అవరోహన క్రమంలో జూనియర్‌లను ముందుగా ఆయా మండలంలో అవసరమైన చోట సర్దుబాటు చేసి మిగిలిన వారిని యధావిధిగా వారి స్థానాల్లోకి పంపించాలని ఒక ప్రతిపాదనగా ఉంది. కానీ ఈ విషయంలో ఇంకా స్పష్టత లేదు. మరో వైపు ఎంపీయూపీ పాఠశాలల్లో 6,7,8 తరగతుల్ని బోధించే సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ఎస్‌జీటీలకు పదోన్నతులిస్తే ఖాళీ అయిన స్థానాల్లో మిగులు ఉపాధ్యాయుల్ని అధికారికంగా నియమించవచ్చు. ప్రస్తుతం మిగులు ఉపాధ్యాయుల గుర్తింపు, పని సర్దుబాటుపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ ముందుగా డీఈవో స్థాయిలో ఆ తర్వాత ఆర్‌జేడీ స్థాయిలో ధ్రువీకరించాల్సి ఉంది. 17వ తేదీన పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఉన్నందున 19వ తేదీలోగా పని సర్దుబాటు లేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

సర్దుబాటు షెడ్యూల్‌ను వాయిదా వేయాలి

అనకాపల్లి : ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈనెల 17న జిల్లాల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆదేరోజు నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్, వర్క్ అడ్జస్ట్‌మెంట్ షెడ్యూల్‌ను వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు. మండలంలో కె.ఎస్.ఆర్.పేట డీఈవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో నిమగ్నమై ఉంటారని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్, సీనియర్ నాయకులు దేముడు నాయుడు, ప్రసన్న పాల్గొన్నారు.

తైక్వాండోలో 4 బంగారు పతకాలు

- మధురవాడ క్రీడాకారుల ప్రతిభ



అతిథుల చేతుల మీదుగా పతకాలు అందుకుంటున్న మధురవాడ క్రీడాకారులు

మధురవాడ: నగరంలోని మధురవాడకు చెందిన తైక్వాండో క్రీడాకారులు 4 బంగారు పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన 9వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ క్రీడాకారులు విశేష ప్రతిభ చూపారు. క్యాడెట్ 12 నుంచి 14 ఏళ్ల కేటగిరీ 60 కేజీల విభాగంలో పి.వెంకటేష్ బంగారు, 41 కిలోల విభాగంలో ఎస్.కె.హరీష్ రజిత పతకాలు సాధించారు. జూనియర్స్ 15 నుంచి 17 ఏళ్ల కేటగిరీ బాలుర 41 కేజీల విభాగంలో ఎస్.నిఖిల్, 49 కిలోల విభాగంలో పి.దుర్గాప్రసాద్, 55 కిలోల విభాగంలో ఎస్.కె.రజక్, బాలికల 53 కేజీల విభాగంలో పి.సాయిభార్గవి ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. విజేతలను ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆనందరావు తదితరులు బుధవారం మధురవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు.

పోర్టుకు ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోండి



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతి పత్రం అందిస్తున్న సిటిజెన్స్ ఫోరం ప్రతినిధులు

విశాఖ సిటీ: శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ కోసం గతంలో విశాఖ పోర్టుకు కేటాయించి ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని గ్రేటర్ విశాఖపట్నం సిటిజెన్స్ ఫోరం ప్రతినిధులు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. విశాఖ పోర్టులో రద్దీని తగ్గించడానికి భీమిలి మండలం మూలకుద్దులో శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సుమారు 16 ఏళ్ల కిందట విశాఖ పోర్టుకు 288.12 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. అక్కడ పోర్టు నిర్మాణ సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై ఆకామ్ అనే కన్సల్టెన్సీ సంస్థ నివేదిక అందించిందని తెలిపారు. దాని ప్రకారం శాటిలైట్ పోర్టుతోపాటు ఫిషింగ్ హార్బర్ కూడా ఆచరణీయమైనది కాదని తేలినట్లు చెప్పారు. దీంతో ప్రస్తుతం ఆ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలని విశాఖ పోర్టు ఆలోచిస్తోందని పేర్కొన్నారు. ఆ స్థలంలో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని, వాస్తవానికి భూమి కేటాయింపు జీవో ప్రకారం ఈ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకూడదని స్పష్టంగా ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మరిడిమాంబ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అమ్మవారి ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: గ్రామ దేవతల ఉత్సవాలను ప్రజలంతా కలిసి ఆనందంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి ఉత్సవ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అమ్మవారి ఉత్సవాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎం.నీలబాబు, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, నగిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు సందడి

కశింకోట: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వివిధ సంస్థల్లో గురువారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీసు స్టేషన్, పాఠశాలల్ని శుభ్రం చేసి, రంగుల జెండాలతో ముస్తాబు చేశారు. స్థానిక దుకాణాల్లో జాతీయ జెండాలు, తిరంగా స్టిక్కర్లు, రబ్బరు బ్యాండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి.

ఘనంగా కల్కి అర్ధ శతదినోత్సవం



కేక్ కట్ చేస్తున్న బుద్ద శ్రీను

అనకాపల్లి: తెలుగు సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి చిత్రం అర్ధ శతదినోత్సవం స్థానిక సత్యనారాయణ థియేటర్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. థియేటర్ అధినేత బుద్ద శ్రీను కేక్ కట్ చేసి, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 49 రోజుల్లో రూ.కోటి 10 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. వెంకటేశ్వర థియేటర్ యజమాని మళ్ల వెంకట్రావు, ప్రభాస్ ఫ్యాన్స్ సంఘం అధ్యక్షుడు జీవీఎల్ఎన్ రాజు, గౌరవ అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 141 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,800	5,050
రెండో రకం	4,000	4,550
మూడోరకం	3,100	3,460

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 392 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నారు ఉంది.. నీరే లేదు

- ఎండలకు బీటలు వారుతున్న వరి పొలాలు
- గతేడాది సాగు విస్తీర్ణం 5,490 ఎకరాలు
- ప్రస్తుతం 1,150 ఎకరాల్లోనే సాగు!
- వర్షాల్లేక వడలిపోతున్న వరినారు
- ఎండిపోతున్న వెదలు
- ఆందోళనలో అన్నదాతలు

నారు పోసిన వాడు నీరు పోయడా అన్నది నానుడి. అన్నదాత విషయంలో మాత్రం అది వర్తించదు. రుతుపవనాలు తంచనుగా వచ్చాయన్న ఆనందంతో నారు పోశారు. తీరా నీరు పోయాల్సిన వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో నారు మడులతోపాటు, మెట్ట భూముల్లో వెద పద్ధతిలో వేసిన వరి కూడా ఎండిపోతోంది. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు మాసాలవుతున్నా అనకాపల్లి మండల పరిధిలో గతేడాది సాగులో ఐదో వంతు కూడా జరగలేదు.



ఎండిపోతున్న వరినారు



బీటలు వారిన వెద పద్ధతిలో విత్తనాలు వేసిన పొలం

తుమ్మపాల: ఖరీఫ్ సాగు ఈ ఏడాది అనకాపల్లి మండల రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఖరీఫ్ ఆరంభం నుంచి రుతుపవనాలు మొదలై, వర్షాలు అడపాదడపా కురుస్తూ వరిసాగుకు ఆలంబనగా నిలుస్తాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చాయి. దీంతో రైతులు ఆనందంగా సాగులో నిమగ్నమయ్యారు. నారుమడులు సిద్ధం చేశారు. గత నెల్లో కురిసిన భారీ వర్షాలకు నారు నీట మునగడంతో భయపడ్డారు. మూడు వారాలుగా చుక్క వర్షం లేక, వేసవిని తలపించే ఎండలతో పొలాలు బీటలు వారడంతో కన్నీరు పెట్టుకుంటున్నారు. ఖరీఫ్ ఆశలు అడియాశలేనని, కనీసం తిండి గింజలకైనా నోచుకునే పరిస్థితి కనిపించట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

250 ఎకరాల్లోనే వరినాట్లు

మండలంలోని 32 గ్రామ పంచాయతీలతో పాటు పట్టణంలోని ఆవఖండం, సాత్-1, 2 ప్రాంతాల్లో గతేడాది 5,490 ఎకరాల్లో నాట్లు, వెద పద్ధతిలో వరి సాగు జరిగింది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 6 వేల ఎకరాలకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టు నుంచి కనీస వర్షాలు కూడా లేవు. బోర్లు, చెరువుల్లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా పొలాలకు పెట్టి, దమ్ముపట్టి, దాదాపు 250 ఎకరాల్లో నాట్లు వేశారు. ఆ మాత్రం నీటి వనరులు కూడా లేని ప్రాంతాల్లో తాజా ఎండలకు నారు మడులు ఎండిపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో గతేడాది జరిగిన సాగులో సగం విస్తీర్ణంలోనైనా నాట్లు పడతాయో.. లేదో తెలియని అయోమయం మండల రైతుల్లో నెలకొంది.

అన్నదాత ఎదలో 'వెద'

పల్లపు ప్రాంతాలు మినహా చెరువులే ఆధారంగా సాగు జరిగే చోట రైతులు వెద పద్ధతిలో వరి సాగుకు మొగ్గు చూపారు. పెరిగిన కూలీల ఖర్చులు, పెట్టుబడులు తట్టుకోలేని వారు కూడా వెద పద్ధతిని ఆశ్రయించారు. ఈ ఏడాది సుమారు 900 ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేపట్టారు. గత నెల వర్షాలకు వారం రోజులకు పైగా వెదలు నీటి ముంపులోనే ఉన్నాయి. ఇప్పుడు చుక్క నీరు లేక బీటలు వారాయి. మండలంలోని తుమ్మపాల, రేబాక, మార్టూరు, కొండుపాలెం, మామిడిపాలెం, కోడూరు, గొలగాం గ్రామాల్లో దాదాపు 700 ఎకరాల్లో వెద పద్ధతిలో చేపట్టిన వరి చేలు ఎండిపోతున్నాయి.

రైతులు ఎండుతు'న్నారు'

పల్లం, మెట్ట గ్రామాల్లో ఏప్రిల్ నుంచే వర్షాలు కురవడంతో రైతులు దమ్ములు పట్టి, నాట్లు వేసేందుకు వీలుగా నారు మడుల్ని సిద్ధం చేశారు. ఆరంభంలో వారం పది రోజులు వర్షాలు కురిసినా నారు సిద్ధంగా లేకపోవడంతో నాట్లు వేయలేకపోయారు. ఆ వర్షాలకు చాలా చోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన చోట కూడా నీట మునిగి, నారు పాడైంది. దీంతో పలు చోట్ల రైతులు మరోసారి నారుమడుల్లో విత్తనాలు చల్లారు. కొన్ని చోట్ల అధికారుల సూచనలతో యూరియా, పలు మందులు జల్లి నారు సంరక్షించుకున్నారు. తాజా ఎండలకు అవీ మిగిలే పరిస్థితిలేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నారు ఎండిపోతోంది



గత నెల వర్షాలకు వరి నారు నీట మునిగి కుళ్లిపోతుందని భయపడ్డాం. నీటిని బయటికి వదిలి కాపాడుకున్నాం. ఇప్పుడు నీరు లేక పొలాలు బీటలు వారుతున్నాయి. మా ఆకుమడి పూర్తిగా ఎండిపోతోంది. ఎకరం భూమికి సరిపడా ఆకుమడి వేశాను. ఆకుమడి తయారీ, మెట్టు దుక్కులకు దాదాపు రూ.12 వేలు ఖర్చయింది. చెరువులో నీరుంది కానీ.. పంటకాలువల గేట్లు మరమ్మతులకు గురవడంతో నీరు పారట్లేదు. మా పొలం చెరువుకు దూరం కావడంతో మోటార్ పెట్టలేని పరిస్థితి. వర్షాలు కురవాలని దేవుడ్ని మొక్కుకుంటున్నాం.

– పచ్చికోర సముద్రాలు, రేబాక గ్రామం

కాలువల ద్వారా నీరివ్వాలి



రుతుపవనాలు ముందుగానే వచ్చాయన్న ఆనందంతో వరిసాగుకు రైతులు ఆసక్తి చూపారు. నారు మడులు వేసి, పొలాల్ని సిద్ధం చేశారు. తీరా ఇప్పుడు ఎండలకు నారు ఎండిపోతోంది. వేచలం, పొలవల్లి జలాశయం, రైవాడ, కోనాం, పెద్దేరు, శారదా నది ద్వారా దిగువకు నీరు విడుదల చేస్తే, ఏటి కాలువల ద్వారా పంట పొలాలకు నీరందుతుంది. ఏటి కాలువల ద్వారా సాగునీటి సరఫరాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తుమ్మపాల, మార్టూరు, శంకరం గ్రామాల పరిధిలో సుమారు 550 ఎకరాల్లో వెదజల్లిన పొలాలు ఎండిపోతున్నాయి.

– పీలా వెంకట తారకరామారావు, రైతు సంఘం నాయకుడు, తుమ్మపాల

విద్యుత్ సమస్యల్ని పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి



హాజరైన సభ్యులు

- కశింకోట మండల పరిషత్ సమావేశంలో సభ్యులు

కశింకోట: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నమ్మి మీనా మాట్లాడుతూ నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెంలో ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని విద్యుత్ అధికారులను కోరారు. బయ్యవరంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీని నివారణకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అక్కడి ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ సూచించారు. నరసింగబిల్లి రెల్లి కాలనీలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని, వీటి వల్ల ఇప్పటికే ఇద్దరు ప్రమాదానికి గురయ్యారని ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా ఆందోళన వ్యక్తం చేశారు. ఈపీడీసీఎల్ తాళ్లపాలెం ఏఈ నాయుడు సమాధానమిస్తూ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటామన్నారు.

తేగాడ ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు మాట్లాడుతూ సర్వే సమస్యలను పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ సురేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 25 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేశామని, ఉగ్గినపాలెం, బయ్యవరం గ్రామాల్లో జరగాల్సిన సర్వే పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు పాస్ పుస్తకాలు మార్చి, కొత్తవి అందిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పావని మాట్లాడుతూ మండలంలో 17 చోట్ల జల్ జీవన్ మిషన్ కింద నీటి పథకాలు మంజూరయ్యాయని, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేటల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మరో పది రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య నివారణకు అందరి ఇళ్లకు కుళాయిలకు ఏర్పాటు చేయాలన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో కె.శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు చెవ్వేటి చెల్లయమ్మ, యల్లపు వరలక్ష్మి, లగిశెట్టి భవాని, గూడెపు లక్ష్మి, సర్పంచ్‌లు, ఈవోఆర్డీ సోమరాజు, ఏవో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పింఛనర్లను పట్టించుకోండి'



డీటీవో సుభాషిణిని సత్కరిస్తున్న పింఛన్‌దారుల సంఘ సభ్యులు

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమస్యలను పరిష్కరించి, 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్ ఎరియర్స్ చెల్లింపు, ఆరోగ్య కార్డుల ద్వారా నగదు రహిత వైద్యసేవల్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక నర్సింగరావుపేటలోని ఏపీటీఎఫ్ భవనంలో బుధవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫించనుదారులు సమష్టిగా ఉంటూ సమస్యల పరిష్కారమార్గానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఖజానా అధికారి(డీటీవో) వీఎల్ సుభాషిణి మాట్లాడుతూ పింఛనుదారులు సమస్యలేమైనా ఉంటే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. తమ కార్యాలయంలో పింఛనుదారుల బిల్లులేవీ పెండింగ్‌లో లేవన్నారు. అనకాపల్లి(పడమర) ఉప ఖజానా అధికారి ఎం.బి.జయకుమార్ మాట్లాడుతూ పింఛనుదారులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం డీటీవో సుభాషిణిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ, కె.రామారావు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సోమేశ్వర్, జిల్లా కోశాధికారి కె.సత్యారావు, వివిధ మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో కెనరా బ్యాంక్ విశాఖ ఏజీఎం మధుసూదన్‌రెడ్డి

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కెనరా బ్యాంక్ విశాఖ ఏజీఎం ఎస్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్ బ్యాంక్ ఆవరణలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆరుగురికి రూ.24 వేలు చొప్పున బుధవారం ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా ప్రతిభగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాల సహకారంతో ఇతర దేశాల్లో చదువుకునే విద్యార్థులకు విద్యా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సిటు పంద్రాగస్టు వేడుకలు



విజేతలకు బహుతులు అందిస్తున్న నరసింగరావు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

అనకాపల్లి: స్వాతంత్య్రోద్యమంలో ఎందరో మహానుభావులు తమ ప్రాణాల్ని త్యాగం చేశారని, వాటి ఫలాల్ని అనుభవిస్తున్న ప్రస్తుత ప్రభుత్వాలు కులం, మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని సీఐటీయూ(సిటు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా సీఐటీయూ, అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా సమష్టిగా పోరాడి బ్రిటీష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టారని, అదే స్ఫూర్తితో మన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ కార్మికులు, వారి పిల్లలు దేశభక్తిని పెంచే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు నరసింహారావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ప్రతినిధులు జి.వరలక్ష్మి, గనిశెట్టి సత్యనారాయణ, డీడీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కురిసింది వాన



తాళ్లపాలెం కూడలిలో నిలిచిన వర్షపు నీరు (ఇన్‌సెట్) నర్సీపట్నం వెళ్లే రోడ్డులో వాన నీటి ప్రవాహం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. తాళ్లపాలెం కూడలి, అక్కడి నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డులో నీరు నిలిచి ప్రజలు, వాహనదార్లు రాకపోకలకు ఇబ్బందులుపడ్డారు. కశింకోట ప్రాంతంలో కూడా ఓ మాదిరి వర్షం పడింది. దీంతో వాతావరణం కాస్త చల్లబడింది. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమితో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

బంగారం కొనుగోలులో బహుపరాక్



మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

అనకాపల్లి: శ్రావణ మాసం ముసుగులో జిల్లాలో స్వచ్ఛత లేని బంగారం, ఆభరణాల అమ్మకాలు జరుగుతున్నాయని వినియోగదారుల సంస్థల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ఆరోపించారు. స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయ ఆవరణలో మహిళలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని జ్యూయలరీ షాపులు ప్రకటించే రాయితీలు, లక్కీ డ్రా కూపన్ల వంటి ఆకర్షణీయ ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాల్ మార్కింగ్ ఆభరణాలు కొనుగోలు చేస్తే, తిరిగి అమ్మేటపుడు అంతే విలువ పొందవచ్చన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, బిల్లులో బంగారం స్వచ్ఛత, ధర, తూకం ఉండేలా చూసుకోవాలన్నారు. కొంతమంది వ్యాపారులు కేడీఎం(కాడ్మియా) స్వచ్ఛతకు గుర్తింపుగా ప్రచారం చేస్తుంటారని, అది వాస్తవం కాదన్నారు. కాడ్మియం అనేది బంగారు ఆభరణాల తయారీలో అతికించడానికి వినియోగించే లోహమన్నారు. హాల్ మార్క్ కలిగిన ప్రతి ఆభరణానికీ ప్రత్యేక సార్వత్రిక సంఖ్య (హెచ్‌యూఐడీ) ఉంటుందన్నారు. దీని ద్వారా తయారీ, విక్రయ వివరాలు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. స్వచ్ఛత నిర్ధారణకు బీఐఎస్ కేర్ యాప్ వినియోగించాలని సూచించారు. బంగారం విక్రేతల మోసాలు, తూనిక ఖచ్చితత్వం, స్వచ్ఛతలపై అనుమానం ఉంటే bis.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లోను, నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్ నెం.1915 ద్వారా లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, ఉపాధ్యక్షుడు కర్రి గంగాధర్, మళ్ల సూరిబాబు, జగన్నాథస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, వృత్తి నైపుణ్య శిక్షకులు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెండా పండగ

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్‌లు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ మలసాల రమణారావు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పార్టీ ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.